


# ఆలోచనల ట్రెయిన్‌లో...

"ప్రోఫెట్ చదివారా?"

"ప్రాఫిట్ ఏమిటండీ?"

"బలేవారేనండీ. కాఫిన్‌లోకి వెళ్ళడానికికూడా ప్రాఫిట్ అడిగేట్టున్నారే!"

"కాఫిన్‌లోకి వెళ్ళడమే పెద్ద ప్రాఫిట్ కదండీ!"

"అయితే నాకు తెలియక అడుగుతాను. ప్రతీ పనికీ ప్రాఫిట్ వుండాలంటారా?"

"కాదూ మరి! చెప్పండి వీలయితే యూసెస్ ఆఫ్ లిటరసీ!"

"మీరు అబ్బాయి అనుకోండి. పాకెట్ వలన ప్రాఫిట్ ఏమిటి?

మీరు అమ్మాయి అనుకోండి. జాకెట్ వలన ప్రాఫిట్ ఏమిటి?"

"నేను అబ్బాయి అనుకోండి. పాకెట్‌లో మనీ దాచొచ్చు.

నేను అమ్మాయి అనుకోండి. జాకెట్‌లో హనీ పెంచొచ్చు."

"మీరు అబ్బాయి అనుకోండి. మనీ ఎందుకు?

మీరు అమ్మాయి అనుకోండి. లాకెట్ ఎందుకు?"

"నేను అబ్బాయి అనుకోండి. మనీ హనీ ముఖ్యం,

నేను అమ్మాయి అనుకోండి. హనీ మనీ సఖ్యం.

నేను అమ్మాయి అనుకోండి లాకెట్

అందాన్ని పెంచేందుకు.''

''జాకెట్‌లో అందాన్ని దాచడ మెందుకు?

లాకెట్‌లో అందాన్ని పెంచడ మెందుకు?''

''ఏమండీ మాట్లాడరు? ఏదో ఓ క్షణంలో ఆగాలనా ఆగేరు? అందుకే వెనకటికెవరో అన్నారు ఒక ప్రశ్నకి సమాధానం లోంచి పది ప్రశ్నలు పుడతాయని. మాట్లాడరేం!''

''ఏం మాట్లాడమంటారు?మాట్లాడక పోవడమే మాట్లాడడం. ఆలోచనలతో ఆడుతున్నా మాటలు. ఇదేమిటీ మనం ఇలా చేస్తాం? ఇదేమిటీ మన పనులు ఇలా వుంటాయి? ఇదేమిటీ జాతి? ఏమిటి దీని ప్రగతి? ఆలోచన తెగదు. ఆలోచన ఆగదు.''

''ఆలోచనకుగల లోచనం నిర్వచనం ఇవ్వలేం. అసలు ఆలోచనను అనుసరించ గలమా?''

''ఆలోచనను అనుసరించాలంటే నాకెలా సాధ్యం? నా ఆలోచనలు అనుసరించాలంటే మరో ఆలోచన రావొచ్చు.''

''మీలో నాలో కలవాటిని చూడ లేము. ఏవో ఏవో లోకంలో వాటిని చూచెదము.''

''ఇదేమిటి మనం ఇలా మాట్లాడు కుంటున్నాం? దీనికి అర్థమేమిటి?''

''అర్థంలేనిది వ్యర్థం. మరి అర్థం కానిది? వ్యర్థం అనుకుంటే మన బతుకే వ్యర్థం.''

''అనుకోకపోవడం కాదా స్వార్థం?''

''స్వార్థంలోనే పదార్థం కలదని ఎవరో అన్నట్టు విన్నట్టు జ్ఞాపకం.''

''జ్ఞాపకం అంటే జ్ఞాపకం వచ్చింది. జ్ఞాపకం అంటే ఏమిటి? ఎలా వుంటుంది? మానవ జీవితంలో ఎసెన్సు. అందమయిన రెమినిసెన్సు. ఉషారయిన ఊహల్లాగే విషాదమైన విషయాలూ వుంటాయిగా. అసలు జ్ఞాపకమంటే ఏమిటి?''

''నిజాన్ని కలగనడమే జ్ఞాపకం. కాదంటారా? ఔనంటారా?''

''ఇదే మాటల్ని ఎక్కడో ఎవరో అన్నట్టు జ్ఞాపకం.''

''కలంటే కలకలం చెలరేగింది. కలంటే ఏమిటి? కలం అంటే ఏమిటి?''

''కలంటే చెప్పడంకంటే అందం మౌనంగా ఊహించుకోనడంలో వుంది. ఎందుకంటే ఎవరిష్టం వచ్చినట్టు వారూ హించుకోవచ్చు. కలం అంటే జరిగినవి గాని జరగనవిగాని జరిగేవిగాని అయిన కలల్ని రికార్డుచేసే యంత్రం.''

''యంత్రం?''

''సాయంత్రాలు యంత్రంలా గడ పడం అంటే ఎవరికిష్టం? అయినా మంత్ర ముగ్ధలయి గడపడం మాత్రం సత్యం. ఎందుకు? అంటే ఏ భాషలో చెప్పను. భాషకు లోబడని భావాలుంటాయి. డ్యూటీలో హేపీగా ఉంటుందా డియర్? ఇక్కడ చికాకుల్ని అక్కడ కౌంటర్ బాలెన్స్. అందుకే కాబోలు అన్నది లా ఆఫ్ కాన్సెర్వేషన్.''

''కాన్సెర్వేషన్ అంటే గుర్తొ

చ్చింది. కాన్‌వెర్‌జేషన్ కేమయినా 'లా' లున్నాయా?"

"'లా'లతో లాలూచీ పడలేం. కానీ డైరీలో పేజీల్లాగే డైలాగ్స్‌తో టాపిక్స్ కూడా మారిపోతాయి. లేదా అటునించి ఇటు."

"ఇంతవరకూ మా టాక్‌ని ఎవరైనా రికార్డ్ చేస్తే ఎంత బాగుండును?"

"ఇక్కడ రికార్డ్ కాని మాటల్లోకి లాగే అయిపోయిన రోజుల్లోకి మళ్ళీ వెళ్ళలేం (?) అందుకే కలలు కనడం?"

"కలల్లో మన కలలే కనాలా ఇంకెవరివైనా కనాలా? కలల రికార్డులు కన కూడదా?"

"జాబిల్లి కింద 'లల్లబీ' ఎంత బాగుంటుంది. బలమైన భావం ప్రభావం తప్పని సరిగా పడుతుంది. న్యూక్లియస్‌లాంటి ఎవర్ గ్రీన్ ఆర్ట్‌నుండి ఇన్‌ఫినిటీ దూరం వెళ్ళివస్తుంది ఎలాక్ట్రాన్‌లాంటి మనసు. ఇప్పుడు చెప్పండి. ప్రతీ పనికీ ప్రాఫిట్ కావాలా?"

"అలా అనకండి. ప్రాఫిట్ లేని పనే లేదు."

"కళలలో ప్రాఫిట్ లేనిది లేదుగానీ, ప్రాఫిట్ వున్నదల్లా పనికాదు. అలాగే ప్రాఫీట్ లేని పనేలేదు అనడం కూడా కళవళ పెట్టేమాటే."

"నిజమే కళ కళకళలాడే కల. దీనికీ, గజిబిజి బిజినెస్‌కీ రిసెంబ్లెన్స్ కాదు. కనీసం రిలేషనుకూడా లేదు.

"కళ్ళు అందమయినవి. ఆకర్షణీయమైనవి. మరి ఆ కళ్ళు? ఎంత ఘోరం! కళాకారుడికికూడా కావాలికదా వేళకి ఖానా?

"ఎక్స్‌ప్లాయిటేషన్‌లో ఇన్‌వాల్వ్ అవడంలో కన్నింగ్ నేచర్ లేదనడంలో కన్నింగ్ నేచర్ ఉందనడం తప్పనడం తప్పంటాను!"

"ఎందుకంత గాభరా! రాబరీ చేసిన వాడిలా గాభరా ఎందుకూ?"

"మానవుడి నేచర్ తెలుసుకోవడం నిజానికి 'గ్రేట్ ఎడ్వెంచర్'.

"నిజానికీ నిజానికి వ్యతిరేకమయినది కూడ నిజమైనదే. అయితే ఈ సెంచరీలో వెంచర్ చేసిన వాళ్ళెందరు?"

"రెడీరెకనర్! అన్నీ లెఖ్ఖల్లోనే వుంటాయిగానీ అన్నిటినీ లెఖ్ఖ వెయ్య కూడదు."

"మనల్ని ఎవరైనా విప్పి తిరగేసి ఆరవేస్తే మనల్ని పోల్చగలరా ఎవరైనా?"

"ఊహలోంచి ఊహ జనించడం. ఊసులోంచి ఊసు జనించడం చెయిన్ రియాక్షన్. దినంలోంచి దినం జనించడంలా ప్రశ్నలోంచి ప్రశ్న జనించడంలా మానవుడనే ఒకే ఒక ప్రశ్నలోంచి ఈ ప్రశ్నలన్ని జనించడం నిజం అంటే నిందించడం నేరం కాదా డియర్?"

"ఈ నిజం ప్రిజన్‌లో పెట్టినా ప్రిజమ్‌లో పెట్టినా ఒకేలా ఉండదూ రైమ్?"

★